# ప్రజా హృదయ విజేత- ఆంధ్ర కేసరి!(ఆగస్ట్ 23న టంగుటూరి ప్రకాశం జయంతి)



జీవితమనేది చరిత్ర పుటల్లో కాక ప్రజా హృదయాలలో నిలిచిపోతే అంతకు మించి ఏ నాయకుడికైనా ఏం కావాలి? ఆ కోవలోకి వచ్చే నాయకుడే ఆంధ్ర కేసరి- టంగుటూరి ప్రకాశం పంతులు. ఆదర్శానికి అసలైన రూపం- ప్రకాశం ఆయన బాల్యం దుర్భరం- అంతా పేదరికం! విద్యావ్యాసంగం అద్వితీయం - వృత్తి గురించి చెప్పాలంటే పట్టిందల్లా బంగారం చివరకు మిగుల్చుకుంది - కేవలం ప్రజాభిమానం! 'నా జీవిత యాత్ర!' అనే పేరుతో ప్రకాశంగారు తన ఆత్మకథ రాశారు. అందులో కల్పితాలనేవి లేవు. చాలా నిజాలున్నాయి. కొన్ని వాస్తవాలు అసలు చోటే చేసుకోలేదు.

ఆంధ్రకేసరి గురించి దివంగత రాష్ట్రపతి వి.వి. గిరి 'నా జీవితయాత్ర'కు రాసిన ప్రస్తావనలో ఇలా అంటారు.

"నాకు పదేళ్ళు వచ్చిన నాటి నుంచి ప్రకాశం గారిని ఎరుగుదును. మా నాయనగారు ప్రకాశం గారు సమకాలికులు. ఇద్దరూ న్యాయవాద వృత్తిలో ప్రముఖులు. స్వాతంత్ర్య సంగ్రామంలోకి ప్రవేశించక ముందు న్యాయవాద వృత్తిలో అమితంగా ఆర్జిస్తూ ఉండేవారు. ప్రకాశంగారు రాజకీయాలలో ప్రవేశించక పూర్వం గొప్ప సంస్కరణ వాది. మన సంఘంలోకి మూఢాచారాలను, కుల, వర్గ, వర్ణ విభేదాలను రూపుమాపడంలో ఆయన ఎంతో శ్రద్ధ చూపేవారు. ప్రకాశం గారు ఎప్పుడూ దూరదృష్టిగల ప్రజానాయకుడు. సామాన్య ప్రజల సౌకర్యాలు, శ్రేయస్సు ఆయన నిరంతరధ్యేయాలు. అందుకే ప్రకాశంగారి పట్ల ఆయన జీవితం పొడుగునా ప్రజలు అపారమైన భక్తి విశ్వాసాలు ప్రదర్శించడంలో ఆశ్చర్యమేమీ లేదు."



ఈ మాటలలో ఒక్క అక్షరం కూడా ఎక్కువగా రాయలేదని ఆంధ్రులందరికీ అనిపిస్తుంది.

"లైఫ్ ఈజ్ ఎ సిరీస్ ఆఫ్ యాక్సిడెంట్స్" - జీవితమంతా ఆకస్మిక ఘటనావళి అనే సామెత మీద ప్రకాశంగారికి ఎంతో నమ్మకం. ఎంతో బీదరికంలో ఉండి కూడా బారిష్టర్ చదవడం, అంతులేని ఐశ్వర్యం సంపాదించడం వెనుక తన ప్రమేయం లేని ఎన్నో సంఘటనల సమాహారమే అని అనేవారు ప్రకాశం.

స్వామి వివేకానంద, లోకమాన్య బాలగంగాధర తిలక్‌తో ప్రకాశంగారు జరిపిన సంభాషణలు, చర్చలు ఆయన జీవితాన్ని మార్చేశాయి. ఆ చర్చలే ఆంధ్రదేశానికి ఓ నాయకుడినిచ్చాయి. 1917లో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ సమావేశానికి ప్రకాశంగారు కూడా హాజరయ్యారు. అప్పటి నుంచి క్రమక్రమంగా స్వాతంత్ర్య సంగ్రామంలోకి అడుగుపెట్టిన ఆంధ్రకేసరి, స్వరాజ్య పత్రిక ద్వారా ప్రజలను జాగృతం చేశారు. అప్పట్లో ఈ పత్రిక కోసం 50 వేల రూపాయలు ఖర్చు చేశారు ప్రకాశం గారు. కాంగ్రెస్ పార్టీ కోసం, ఖాదీ ఉద్యమం కోసం లక్షల రూపాయలు అర్పించారు.

ప్రజలు ఆయనకు పదవులనిస్తే కొందరు నాయకులు ఆయనను ఫకీరును చేశారు. ఈనాడు మనం రాజకీయాలలో చూస్తున్న కుత్సితాలు, కుట్రలు, కుతంత్రాలు ఆనాడూ ఉన్నాయి. వాటికి బలైపోయిన నాయకుడు ప్రకాశం. సంపూర్ణ మద్యనిషేధం వంటి పథకాలు సుమారు పదిహేనేళ్ళ క్రితం రాష్ట్ర రాజకీయాలను మార్చినట్టే ఆనాడు ప్రకాశం గారి ప్రభుత్వాన్ని ప్రభావితం చేశాయి.

ఒక నాయకుడికి నిజమైన గౌరవాన్ని తెచ్చిపెట్టేది ప్రజలే కావచ్చు. కానీ వెలుగునిచ్చేది మాత్రం పదవులే! ప్రకాశం గారంటే ఇప్పటికీ ఉన్నది శాశ్వత గౌరవమే!